ఆర్‌డిటి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం మే 2007

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

తూర్పు ఆసియా ప్రాంతంలో భూమి అడుగున ఒక నీటి సముద్రాన్ని కనుగొన్నట్లుగా వాషింగ్టన్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇది ఆర్కిటిక్ సముద్రంత వైశాల్యంతో ఇండోనేషియా దీవులనుండి, ఉత్తర రష్యా వరకూ విస్తరించి ఉన్నదట. వీరు భూకంప లక్షణాలను పరిశీలించడానికి వచ్చినవారు. 700 నుండి 1400 కి.మీ. లోతున ఈ నీటి సముద్రం బలహీనమైన రాతి పొరలతో ఉంటూ, పొరల గట్టిదనం క్రమేపీ కోల్పోతున్నట్లుకూడా ప్రకటించారు. ఇదే గనుక జరిగితే మధ్య ఆసియాలో చమురుకోసం యుద్ధాలు సాగిస్తున్నట్లుగా రాబోయే రోజుల్లో ఈ నీటికోసం యుద్ధాలు తప్పవేమో ?

(డౌన్‌టుఎర్త్ మార్చి 31, 2007 ఆధారంగా)

వృధా నీళ్ళ బాటిళ్ళు, ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తూ తలనొప్పిగా మారడం మనం గమనిస్తూ ఉన్నాం. వీటిని రీసైకిల్ ప్రక్రియగా తిరిగి ఉపయోగంలో ఈసారి దుస్తుల రూపంలో ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, రీసైకిల్డ్ బాటిళ్ళ నుంచి పాలిష్టర్ దారాన్ని ఉత్పత్తి చేస్తూ నూలుతో కలిపి అందమైన దుస్తులు తయారుచేసి ప్రదర్శనకు ఉంచారట. అలాగే వెదురు నారతోనూ, చేప చర్మాలతో చేసిన దుస్తులు కూడా బాగా ఆకర్షించాయట. వీటిని ఇ-ఫాబ్రిక్స్ అనవచ్చంటున్నారు. రాబోయే రోజులలో మనం ఈ రకం గుడ్డల్ని చూడబోతామన్నమాట.

★★★

సాధారణంగా వచ్చే జలుబుల గురించి విసుక్కోవాల్సిన అవసరం లేదు. పైగా సంతోషపడే రోజులొచ్చాయి. బ్రిటీష్ శాస్త్రవేత్తలు సాధారణ జలుబుల్ని తెచ్చే వైరస్ తోటి క్యాన్సర్ కణాలు పోగొట్టడానికి పరీక్షలు నిర్వహిస్తున్నారట. ఇదే గనుక విజయవంతమైతే సాధారణ జలుబులు మనకు కాన్సర్ నుండి రక్షణ ఇస్తాయని సంతోషపడవచ్చు.

(డౌన్‌టుఎర్త్ ఫిబ్రవరి 15, 2007 సంచికనుండి)

**చిట్కా : ఎక్కిళ్ళు అధికంగా వస్తున్నవారు శొంఠి చూర్ణాన్ని పాలల్లో కలుపుకుని తాగితే ఎక్కిళ్ళు తగ్గుతాయి.**

## పేదలకు వరం - ఆరోగ్యశ్రీ భీమా పథకం

మిత్రులారా !

ఈమధ్య పత్రికలద్వారా, టి.వి.ల ద్వారా ఆరోగ్యశ్రీ భీమా పథకంకింద తెల్లకార్డులుగల వారు ప్రభుత్వం గుర్తించిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సదుపాయం పొందవచ్చునని తెలుసుకునే ఉంటారు. కార్పొరేట్ ఆసుపత్రులంటే ఆధునిక వైద్య సామాగ్రితో నిష్ణాతులైన వైద్య బృందంతో, ఉత్తమమైన వైద్య సదుపాయాలు సేవలతో వైద్య సహాయం అందించేవి. ఇందులో సేవలు ఏవీ ఉచితం కావు. ప్రైవేటు యాజమాన్యంలో నడిచే ఈ ఆసుపత్రులు సేవలకు అదే స్థాయిలో భారీగా బిల్లులు వడ్డిస్తాయి. ఇలాంటి కార్పొరేట్ వైద్యశాలలు పేదవారి మాట అటుంచి మధ్య తరగతి వారికే అందుబాటులో లేవు. ధనికులకు తప్ప అందని ఈ వైద్యం ప్రభుత్వం పేదలకు అందుబాటులోకి తెచ్చింది.

గతంలో ఖరీదైన రోగాలు అంటే గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, కేన్సరులాంటి రోగాలు శ్రమ అంటే ఏమిటో తెలియని వర్గాలకు వారికి మాత్రమే వస్తూండేవి. మారిన ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం, విచక్షణా రహితంగా పురుగుమందుల వాడకం, వీటన్నిటి కారణంగా ఈ ఖరీదైన జబ్బులు సంపన్న వర్గాల వారికే పరిమితం కాక, బీద, మధ్య తరగతి వర్గాలకు వ్యాపించినాయి. వై.యస్. రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన వెంటనే గుండె జబ్బులున్న పేద పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వైద్య సహాయం అందిస్తుందని ప్రకటించగానే ప్రతి జిల్లాలోను వందలాది మంది తల్లిదండ్రులు గుండెజబ్బులగల తమ పిల్లలకు వైద్య సదుపాయం కొరకు అధికారుల చుట్టూ తిరిగారు. గుండె జబ్బులంటే వయస్సుమళ్ళిన వారికి, శరీరంలోని రక్తనాళాలలో క్రొవ్వు పేరుకునిపోయిన వారికే గుండె జబ్బులు వస్తాయన్న అభిప్రాయం ఉండేది. కానీ పుట్టుకతోనే గుండె జబ్బులతో పుట్టిన పిల్లలు, వారి తల్లిదండ్రుల మానసిక, ఆర్థిక స్థితి దయనీయం. ఇదంతా మనం ప్రకృతి నుండి దూరంగా వెళ్ళిపోవడమే కారణం. ఆఫ్ఘనిస్తాన్‌లో, ఇరాక్‌లో అమెరికా ప్రయోగిస్తున్న భయంకరమైన బాంబుల కలుషిత ధూళివల్ల వాతావరణం కలుషితమైపోయి వాతావరణంలో తీవ్రమైన మార్పులు ఏర్పడి, ప్రజలకు రోగాలు ఎక్కువవుతున్నాయని కూడా కొంతమంది పర్యావరణవేత్తలు విశ్లేషిస్తున్నారు. కారణం ఏమయినప్పటికి, ప్రపంచంలో అధికారమత్తులో ఉన్నవారు ప్రజాక్షేమం పట్టనివారు చేసే ఆకృత్యాలు, తద్వారా ఏర్పడే ప్రకృతి వైపరీత్యాలకు బలయ్యేది నిరుపేదలే. డబ్బున్న వారు ఎన్ని లక్షలు, కోట్లయినా ఖర్చుపెడతారు. ఆరోగ్యాల్ని కొనుక్కుంటారు.

ఈ పరిస్థితులలో ప్రభుత్వం నిరుపేద కుటుంబాలవారికి అధునాతన ఆరోగ్య సేవలు ఉచితంగా సమకూర్చే విధంగా "ఆరోగ్యశ్రీ" భీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని పటిష్టంగా అమలుజరపడానికి సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక హెల్త్‌కేర్ ట్రస్టును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భీమా, వైద్యరంగాలలో నిపుణుల సహాయంతో ఈ ట్రస్ట్ ఒక చక్కటి భీమా పథకాన్ని రూపొందించింది. నిరుపేదలకు అవసర సమయాల్లో చికిత్సా సౌకర్యాలు సమకూర్చడంవారు అప్పుల బారిపడకుండా ఉండడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ పథకం కింద భీమా సౌకర్యాన్ని కల్పించే నిమిత్తం టెండర్ల ప్రక్రియ తర్వాత 'స్టార్ హెల్త్ అండ్ ఎలైడ్ ఇన్సురెన్స్ కంపెనీ'ని ఎంపిక చేశారు. మొదటి సంవత్సరం ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరించింది. ఆసుపత్రులలో ఈ వ్యవహారం సజావుగా నడవడానికి ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో "ఆరోగ్య మిత్ర" పేరుతో సహాయపడుతారు.

అసలు ఈ ఆరోగ్యశ్రీ సామూహిక ఆరోగ్య భీమా పథకమంటే ఏమిటి? ఇపుడున్న ప్రభుత్వ →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

వైద్యశాలల్లో దొరికే ఆరోగ్య సదుపాయాలకు ఇది ఏ రకంగా భిన్నమైనదనే అనుమానాలు మనకు రావడం చాలా సహజం.

ఆరోగ్యశ్రీ సామూహిక ఆరోగ్య పథకం అనేది కుటుంబ భీమా పథకం. ప్రస్తుతం దేశంలో కొన్ని భీమా కంపెనీలు మనతో సంవత్సరానికింత ప్రీమియం కట్టించుకుంటాయి. భీమా మొత్తాన్ని అనుసరించి అనుకోకుండా మనం అనారోగ్యం పాలయితే, భీమా కంపెనీలు వైద్య ఖర్చులు అవి కుదుర్చుకున్న పరిమితులకు లోబడి తిరిగి మనకు చెల్లిస్తాయి. అటువంటిదే ఈ భీమా పథకం. ఈ పథకం వర్తింపజేసే ప్రాంతాలలోని తెల్ల రేషన్ కార్డులుగల పేదలందరూ అర్హులే. మొదటగా రాష్ట్రంలోని అనంతపురం, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం జిల్లాల్లోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలవారికి ఈ పథకం ఉద్దేశించబడింది. ఈ పథకం కింద గుండె, మూత్రపిండాలు, మెదడు, క్యాన్సర్ వ్యాధులచికిత్స, కాలిన గాయాలు, ఇతర గాయాల చికిత్స పూర్తి ఉచితంగా అందించడం జరుగుతుంది.

అయితే మోటారు వాహనాల చట్ట పరిధికి ఇది వర్తించదు. అనంతపురం, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం జిల్లాలోని తెల్ల రేషన్‌కార్డు (తెలుపు, అన్నపూర్ణ, అంత్యోదయ) కలిగి ఉన్న కుటుంబాల వారందరూ ఈ పథకానికి అర్హులే. రేషన్ కార్డులపై పేరు, ఫోటో కలిగిన కుటుంబ సభ్యులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం ప్రీమియం ప్రభుత్వమే భరిస్తోంది. కాబట్టి ఎవరూ ఏమీ కట్టనవసరం లేదు.

## ఈ పథకం ద్వారా వచ్చే ప్రయోజనాలు :

కుటుంబ సభ్యులలో ఎవరికైనా గుండె, మూత్రపిండాలు, మెదడు, కాన్సర్ వ్యాధుల చికిత్స, కాలిన గాయాలు, ఇతర గాయాల చికిత్సలకు ఆసుపత్రిలో అయ్యే ఖర్చులు, శస్త్ర చికిత్స ఖర్చులతో సహా ఈ పథకం కింద లభిస్తుంది. ఇందుకు ఆసుపత్రికి ఏమి చెల్లించనవసరంలేదు. మూత్ర పిండాలు, గుండె, క్యాన్సర్ వ్యాధుల చికిత్స, కాలిన గాయాలు, ఇతర గాయాలకు అవసరమైన ఆపరేషనల్లు, తదితర చికిత్సలన్నీ తెల్లకార్డులుగలవారికి ఉచితంగా లభిస్తాయి. వైద్య చికిత్సలు ఎక్కడ లభించేది తదితర విషయాలన్నీ ఏ పి.హెచ్.సి.లోనైనా "ఆరోగ్యమిత్ర"ను సంప్రదిస్తే మొత్తం వివరాలు దొరుకుతాయి. ప్రభుత్వం ఇందుకోసం కొన్ని ప్రైవేట్ వైద్యశాలలను గుర్తించింది. మన జిల్లాలో ఆశా హాస్పిటల్స్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ ప్రభుత్వం గుర్తించిన ఈ వైద్యశాలల్లో పేరు నమోదు చేసుకునేందుకు, రోగులను చేర్చుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఉంటాయి. శస్త్ర చికిత్సలకు ప్రత్యేక ప్రాధాన్యతలనిస్తారు. ఒకవేళ ఆరోగ్య పరీక్షల అనంతరం శస్త్ర చికిత్సలు అవసరం లేదని తేలితే ఆ స్థాయిలోకూడా ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.

వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నట్లయితే, మీ సమీప పబ్లిక్ హెల్త్ సెంటరులో సంప్రదించాలి. వారు మీ అవసరానికి తగు సూచనలు ఇస్తారు. ఈవరకే వ్యాధి నిర్ధారణ అయిన వారి విషయంలో వారు నేరుగా ప్రభుత్వం గుర్తించిన ఆసుపత్రికి వెళ్ళవచ్చు.

## భీమా వర్తింపు :

ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి 1.5 లక్షల భీమా వర్తిస్తుంది. ఇందులో కొంత మొత్తం కుటుంబంలోని ఒక వ్యక్తి ఉపయోగించుకున్నట్లయితే, మిగిలిన మొత్తం మాత్రమే మిగతా కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటుంది. 1-4-2007 ఈ పథకం ప్రారంభించబడింది. ఒక సంవత్సరంపాటు భీమా కాలం కొనసాగుతుంది. తెల్లకార్డులో పేరు ఫోటో ఉంటేచాలు ఈ పథకం వర్తించినట్లే. ప్రత్యేకంగా పేర్ల నమోదు కార్యక్రమాలేవీ లేవు. రోగం చెప్పిరాదు కదా ! అటువంటి పరిస్థితులలో నేరుగా ప్రభుత్వం గుర్తించిన ఏ వైద్యశాలకైనా వెళ్ళవచ్చు.

కార్డుమాత్రం మీ వెంట ఉండవలసిందే. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టరు, రాష్ట్రస్థాయిలో ఆరోగ్య ట్రస్టు ఈ పథకం నిర్వహణ భాద్యతల్ని చూస్తారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమయితే "ఆరోగ్యమిత్ర" చూస్తారు. తదుపరి అవసరమైతే జిల్లా కో-ఆర్డినేటర్ సహాయంమందించాలి, లేదా జిల్లా కలెక్టరు సమస్యను పరిష్కరిస్తారు.

ఈ పథకం ద్వారా ఈ కింది జబ్బులకు వైద్య సహాయం అందిస్తారు.

## గుండె జబ్బులు :

గుండెకు బైపాస్ సర్జరీ, గుండె కవాటాల మార్పిడి, పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, యాంజియోప్లాస్టీ మొదలగునవి.

## మూత్రపిండ వ్యాధులు :

మూత్రపిండాల మార్పిడి, మూత్రపిండాలలో రాళ్ళు తొలగించే ఆపరేషన్లు.

## కాన్సర్ వ్యాధి

అన్నిరకాల కాన్సర్ సంబంధ ఆపరేషన్లు

## మెదడుకు సంబంధించినవి

మెదడులో కంతి, మెదడులో చేరిన నీటిని తొలగించే ఆపరేషన్, మెదడులో స్రవించిన రక్తాన్ని తొలగించే ఆపరేషన్, మెదడులో చీమును తొలగించే ఆపరేషన్, మెదడులో చెడిపోయిన భాగాన్ని తొలగించే ఆపరేషన్, మెదడుకు అయ్యే గాయాల ఆపరేషన్, వెన్నెముక ఆపరేషన్లు

## గాయాలు

కాలిన గాయాలకు చికిత్స, ప్రమాదంలో జరిగిన గాయాలకు శస్త్ర చికిత్స

**పై వ్యాధులన్నింటికీ వైద్య సదుపాయం దొరుకుతుంది. ఏ లక్షణాలు కనపడితే వైద్యులను సంప్రదించాలో కూడా తెలుసుకుందాం.**

## గుండెకు సంబంధించినవి

ఎడమ ఛాతీలో నొప్పి, చెమటలు పోయడం, ఎడమ భుజంలో నొప్పిరావడం, కొద్ది దూరం నడిస్తేనే ఆయాసం, తలతిరగడం.

## మెదడు

తీవ్రమైన తలనొప్పి, వాంతులు

వస్తువులు రెండుగా కనపడడం

చిన్నపిల్లలో మూర్ఛవ్యాధి

ఫిట్స్ (మూర్ఛవ్యాధి)

## కాన్సర్

నాలుకపై నెలల తరబడి మానని పుండు

శరీరంపై మాననిపుండ్లు

అతిగా పెరుగుతున్న నొప్పిలేని కంతి.

రొమ్ములో కంతి,

ఎడతెగని దగ్గు, కళ్ళెలో రక్తం పడడం.

బహిష్టు నిలిచిపోయిన చాలా కాలం తర్వాత మళ్ళీ బహిష్టు రావడం.

## మూత్రపిండాలు

కాళ్ళు, శరీరం, పొట్ట లావెక్కడం, మూత్రం అతిగా లేదా కొద్దిగా రావడం

పై లక్షణాలలో ఏవి కనిపించినా వెంటనే దగ్గరలో పి.హెచ్.సి.లో వున్న ఆరోగ్య మిత్రను కలిస్తే, ఏ వైద్యశాలకు వెళ్ళాల్సిందీ చెబుతారు.

అనేక ప్రభుత్వ పథకాలు వస్తుంటాయి. పేదలనుద్దేశించి కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కలగా వున్నటువంటి పేదవారికి ఈ పథకం ఒక జీవన ప్రదాయిని పథకాన్ని సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ఆ పథకం విజయవంతం అవుతుంది. రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని పేదలందరికీ ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేస్తుందని ఆశిద్దాం.

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి**

## నీతి వాక్యం :

అ॥ భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్
భూషితకేశపాశమృదు పుష్ప సుగంధజలాభిషేకముల్
భూషలుగావు పూరుషుని భూషితుఁజేయుఁ బవిత్రవాణి వా
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్.

\- భర్తృహరి -

## తాత్పర్యము :

పురుషునకు, భుజకీర్తులు, సూర్యహారములు, చంద్రహారములు మొదలగు సొమ్ములుగానీ, స్నానము, చందనము పూసుకునుట, పూలు ముడుచుకునుట, కురులు దువ్వుకునుట మొదలగువానిలో ఏదీ అలంకారము ఇయ్యజాలదు. శాస్త్ర సంస్కారముగల వాక్కు ఒక్కటే అలంకారము కలుగజేస్తుంది. సువర్ణమయాది భూషణములన్నియు నశించును. వాగ్భూషణమొక్కటే నశింపని భూషణము.

## చర్చ :

ఈ పద్యంలో భర్తృహరి పురుషుల గురించి ప్రస్తావించాడు. ఆకాలంలో బయటి వ్యవహారాలు నడిపేది పురుషులేకాబట్టి స్త్రీలను గురించి ప్రస్తావించలేదు. పురుషులతో సమానంగా మహిళలు ఉద్యోగాలు, ఆభరణాలు, అలంకార సాధనాలచేత ఏ మనిషికీ అలంకారం ఇవ్వజాలదని భర్తృహరి చెబుతున్నారు. వాక్కు ఎంతటి ప్రాముఖ్యతగలది అంటే, ఆ వాక్కు వక్రమార్గంలో పయనిస్తే, కొట్లాటలు, దౌర్జన్యాలు, హత్యలు సమస్తం సంభవించే ప్రమాదం ఉంది. మాటలలో సౌమ్యత, మార్దవం, సంస్కారం ఉట్టిపడితే చేదు వాస్తవాలైనా ఎదుటివ్యక్తి నమ్రతగానే స్వీకరిస్తాడు. అయితే గతంలో చదువు సంస్కారం కలగలసి ఉంటాయని భావించేవారు. ఇపుడు చదువువేరు, సంస్కారం వేరు. చదువు మానవప్రవర్తనను శాసించడంలేదు. భాషలో మధురత, అభిప్రాయాలలో మానవీయత, తోటి మానవులపట్ల ఆత్మీయత ఇవన్నీ మనిషిలోని సంస్కారానికి చిహ్నాలు. మనిషిలో సంస్కారం ప్రతిఫలిస్తే, గౌరవ భావం కలుగుతుంది. నోరు అదుపుతప్పితే అనేక అనర్థాలకు మూలం అవుతుంది. ఎంతటి గొప్ప వాడైనా సరే, ధనవంతుడైనా సరే, సామాజిక సేవలో తరించే వాడైనా సరే, తాను గొప్ప పనులు చేస్తున్నానని ఇతరులను చులకనగా చూడడం సంస్కార రాహిత్యమే అవుతుంది. అటువంటి వారి మంచి పనులు బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగానే అవుతుంది.

**వై.వి. మల్లారెడ్డి**

# ఈ మాసం వ్యవసాయం

## రామచంద్రాపురం యన్.పి.యం. రైతుల విజయగాథ

ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు మండలంలో ఎక్కువగా పత్తి పంటను సాగు చేస్తారు. గత 30 సంవత్సరాలుగా ఇక్కడ రైతులు పత్తి పంట మీద ఆధారపడ్డారు. ఇదే మండలంలో గుంటిపుడి పంచాయితీలోని రామచంద్రాపురం ఒక చిన్న గ్రామం. ఈ గ్రామంలో సుమారు 100 కుటుంబాలు, 450 మంది జనాభా ఉన్నారు. వీరంతా కోయ తెగలకు (ఎస్.టి.) చెందినవారు. ఎక్కువ మంది నిరక్షరాసులు. ఇక్కడ ప్రజలలో అమాయకత్వం, ఇచ్చిన మాటకు కట్టుబడటం వంటి లోణాలు ఎక్కువ.

ఇక్కడ రైతులందరికీ దాదాపు 2 నుండి 5 ఎకరాల సొంత సాగుభూమి ఉంది. దాని సాగుబడి మాత్రము వారి చేతులలో లేదు. కొందరు రైతులు తమ భూమినంతటిని, మరికొందరు తమ భూమిలో చాలా భాగాన్ని గుత్తకు ఇచ్చినారు. తమ భూమిని వేరే పెద్ద రైతులకు గుత్తకు ఇచ్చి తాము అదే భూమిలో వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. ఇక్కడ రైతులకు ఈ పరిస్థితి దాపురించడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి.

పత్తి సాగు ప్రారంభంలో సస్యరక్షణకు, ఎరువులకు చాలా తక్కువ ఖర్చు అయ్యేది. కాని గత 10 సంవత్సరాలుగా పురుగుమందుల వినియోగం విపరీతంగా పెరిగింది. పక్క గ్రామాలలోని డీలర్లు పురుగుమందులు, ఎరువులు వాటితోపాటు విత్తనాలు, కూలీ ఖర్చులు, సస్యరక్షణ ఖర్చులు మొదలైన వాటికి అవసరమైన మొత్తాన్ని రైతులకు అప్పుగా ఇచ్చి వారి నుండి ఖాళీ ప్రాంసరీ నోటు మీద సంతకం తీసుకునేవారు. తిరిగి పంట చేతికి రాగానే ఆ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసుకొనేవారు. రైతులకు తాము పండించిన పత్తిని బయట తమ ఇష్టం వచ్చిన చోట అమ్ముకొనే స్వేచ్ఛ లేదు. అప్పు ఇచ్చిన వ్యక్తి చెప్పిన ధరకు అతనికే అమ్మాలి. దీని వలన రైతులు రెండు విధాలుగా నష్టపోయారు. డీలర్ చెప్పినట్లు వడ్డీ రేటు చెల్లించాలి. మార్కెటింగ్ వారి చేతులు దాటి ఆ డీలర్లు, దళారులచేతలలోకి వెళ్ళిపోయింది. తర్వాత పురుగు మందుల ధరలు పెరిగాయి. పంట చేతికి వచ్చేసరికి రైతుకి ఏమీ మిగలని పరిస్థితులు ఏర్పడ్డాయి. గత 5 సంవత్సరాలనుండి అసలు పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు. పండించిన పంట మొత్తాన్ని డీలర్‌కు ఇచ్చి తాము వట్టి చేతులతో రావలసి వస్తోంది. రైతులు డీలర్‌కి బాగా అప్పులు పడిపోయారు. అప్పు తీర్చలేక తమ పొలాలను ఆ డీలర్లకే లీజుకిచ్చేసారు. చివరికి గ్రామంలో దాదాపు అందరూ తమ భూములపై సాగు చేసుకునే హక్కును తాత్కాలికంగా కోల్పోయారు. తమ భూములలో కూలీకి వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కొందరు రైతులు మిగిలిఉన్న 1 లేక 2 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు.

గత సంవత్సరం మార్చి నెలలో సి.ఆర్.డి.ఎస్. స్వచ్ఛంద సంస్థ వారు రామచంద్రాపురం గ్రామంలో ఎన్.పి.యం. పద్ధతుల గురించి ప్రచారం చేశారు. మే నెలలో సి.ఆర్.డి.ఎస్. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'ఇందిరా క్రాంతి పథం' సహకారంతో రామచంద్రాపురం గ్రామంలో ఎన్.పి.యం. పద్ధతులలో పత్తి సాగు మొదలు పెట్టారు. భూములు లీజుకు ఇచ్చి పోగొట్టుకున్నవారు కాకుండా మిగిలిన సగం మంది రైతులవద్ద ఉన్న 1,2 ఎకరాలలో ఎన్.పి.యం. పద్ధతిలో వ్యవసాయం చేశారు. మొత్తం 34 మంది రెతులు...అంటే ఈ గ్రామంలో ఈ సంవత్సరం వ్యవసాయం చేసే దాదాపు అందరు రైతులు ఈ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చారు. రైతులు ఎన్.పి.యం. పద్ధతులను మొదట నమ్మలేదు. ప్రారంభంలో వేసవి దుక్కులు చేశారు. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా వచ్చిన కారణంగా జూన్ ఆఖరి వారంలో వచ్చిన వర్షాలకి దాదాపు అందరు రైతులు విత్తనాలు వేశారు. గ్రామంలో దాదాపు 20 మంది రైతులు వేపగింజలు వేసవిలోనే సేకరించుకున్నారు. మిగిలిన రైతులు లోన్ ద్వారా కొనుగోలు చేశారు. మొక్క 25 రోజుల వయస్సులో ఉన్నప్పుడు పేనుబంక వచ్చి ఆకులు ముడత పడిపోయాయి. అప్పటికే గ్రామంలో వేప కషాయం తయారు చేసి చూపించడం జరిగింది. మొదట శ్రీను, రాజు అనే రైతులు వేప కషాయం తయారు చేసుకొని పిచికారి చేశారు. 3 రోజులలో పేనుబంక తగ్గి ముడత తేలిపోవడంతో గ్రామంలో అందరూ వేప కషాయం పిచికారి చేశారు. ఆ తరువాత 4వ రోజు పశువుల పేడ మూత్రం ద్రావణం పిచికారి చేశారు. వేప కషాయం వలన మొక్కలు కాస్త పెలుసుబారినట్లుకాగా, పశువుల పేడ మూత్రం పిచికారీ వలన మొక్కలు పచ్చబడడం ఏపుగా ఆరోగ్యాంగా పెరగడం చూసి రెండు ద్రావణాలు ఒకదాని తర్వాత ఒకటి పిచికారి చేశారు. ఈ విధంగా మొత్తం పంట కాలంలో దాదాపు నాలుగుసార్లు వేప కషాయం, నాలుగు సార్లు పశువుల పేడ మూత్రం ద్రావణం పిచికారి అవసరం అయినది. పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు పశువుల పేడ మూత్రం ద్రావణంలో వావిలాకు రసం కాని, కొడిసె చెక్క రసంకాని కలిపి పిచికారి చేశారు. పక్షి స్థావరాలను, పసుపు పళ్ళేలను, లింగాకర్షక బుట్టలను చేనులలో అమర్చి రైతులు స్వయంగా వాటి ఉపయోగాలను తెలుసుకున్నారు. మొక్క 50 మంది 60 రోజులు వచ్చేసరికి పక్క చేనులలో ఉన్న నాన్ ఎన్.పి.యం. చేలకి, ఎన్.పి.యం. చేలకి మధ్య తేడా చాలా స్పష్టంగా కనబడింది.

ప్రక్క గ్రామంలో రైతులు మొదట తమని, తాము ఆచరించే పద్ధతులను ఎగతాళి చేసినప్పటికి కో-ఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్‌లు ఇచ్చిన శిక్షణ, స్ఫూర్తితో ఎన్.పి.యం. పద్ధతులను నమ్మి వాటిని ఆచరణలో పెట్టినందుకు రైతులకు మంచి ఫలితం దక్కింది.

రామచంద్రాపురంలో మహిళా గ్రామ సంఘం ఉన్నది. గ్రామ సంఘం పేరు "దుర్గా" గ్రామ సంఘంలోని అధ్యక్షురాలు, కోశాధికారి, సెక్రటరీ, ఇ.సి. సభ్యులు అందరూ దాదాపు ఎన్.పి.యం. రైతుల భార్యలే. రైతులకి గ్రామ సంఘాల ద్వారా "ఇందిరా క్రాంతి పథం" వారు వేప గింజలు, లింగాకర్షక బుట్టలు మొదలైన ఉత్పాదకాలను సామాజిక పెట్టుబడి నిధి రూపంలో ఇవ్వడం జరిగింది. ప్రతి నెలా జరిగే గ్రామ సంఘం సమావేశంలో ఆ సమయంలో ఉన్న పురుగులు, తెగుళ్ళు, వాటి సస్యరక్షణ చర్యలు, ఆ చర్యలవల్ల వచ్చిన సత్ఫలితాలు చర్చించడం జరుగుతోంది. గ్రామ సమాఖ్య సభ్యులు ప్రత్యక్షంగా ఎన్.పి.యం. కార్యక్రమంలో పాల్గొంటున్నారు కాబట్టి జరిగే అన్నింటి మీద ఆ గ్రామ మహిళలకు స్పష్టమైన అవగాహన ఉంది. కషాయాల తయారీ, ఇతర ఎన్.పి.యం. పద్ధతుల అమలులో తమ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించడం జరిగింది.

పక్క గ్రామలలోని రైతులు ఈ ఎన్.పి.యం. చేలను చూసి తమకు కూడా ఆ పద్ధతులు నేర్పమని అడగటం, వేప గింజలు తీసుకొని తాము కూడా తమ చేలలో వేపకషాయం పిచికారి చేయడం మొదలైంది. ప్రతి నెల జరిగే మండల మహిళా సమాఖ్య సమావేశంలో వచ్చే సంవత్సరానికి కొత్తగా ఎంపిక చేసే ఎన్.పి.యం. గ్రామాలలో తమని ఎంపిక చేయాలని అన్ని గ్రామ సంఘాల నుండి ఒత్తిడి పెరుగుతోంది.

ఇప్పుడు రామచంద్రాపురంలోని రైతులకు ధైర్యంగా తాము పండించిన పత్తిని తమ ఇష్టం వచ్చిన తోట అమ్ముకునే స్వతంత్రం వచ్చింది. దాదాపు ప్రతి సంవత్సరం పురుగు మందులకు ఎకరానికి 5 వేల రూపాయలకు తగ్గకుండా అయ్యే పెట్టుబడి అనూహ్యంగా ఈ సంవత్సరం కషాయాలు, ఇతర ఎన్.పి.యం. పద్ధతులతో రూ.500/- కంటే తక్కువగానే ఖర్చు కావడంతో తాము సమర్ధవంతంగా వ్యవసాయం చేయవచ్చు అనే నమ్మకం రైతులలో బలంగా ఏర్పడింది. ఇక తమ భూములు ఎప్పుడు తమ చేతికి వస్తాయో అవి రైతులు కొత్త ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు పురుగుమందుల వినియోగంతో వ్యవసాయం చేయలేని పరిస్థితులలో భూమిని గుత్తకు ఇచ్చి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న రైతులు ఎన్.పి.యం. పద్ధతి ద్వారా సాగు చేయడంవల్ల తమ భూమిని తామే సాగుచేసుకొనగలమని నిర్భయంగా చెబుతున్నారు. కొందరు రైతులు మరో అడుగు ముందుకు వేసి 2006 ఖరీఫ్‌లో వేరే రైతుల (నాన్ ఎన్.పి.యం.) చేలను కూడా గుత్తకు తీసుకొని సాగుచేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

రామచంద్రాపురం రైతుల జీవిత విధానాన్ని వారి జీవన ప్రమాణాలను ఎన్.పి.యం. పద్ధతి బాగా ప్రభావితం చేసింది. ఈ సంవత్సరంలో ఎకరానికి దాదాపు 7 నుండి 10 క్వింటాళ్ళ పత్తి దిగుబడి వచ్చినది. మొత్తం మీద విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణకు దాదాపు ఎకరానికి రూ.2,000/-లకు మించి పెట్టుబడి కాలేదు. అంటే ఎకరానికి కనిష్టంగా రూ.8,000/- ఆదాయం లభించింది. ఎన్.పి.యం. పద్ధతిలో సన్న, చిన్నకారు రైతుల నికర ఆదాయాన్ని గణనీయంగా పెంచడంవల్ల పేదరిక నిర్మూలనను సుసాధ్యం చేయవచ్చునని రామచంద్రాపురం గ్రామస్థులు నిరూపిస్తున్నారు.

(పురుగుమందుల్లేని సేద్యం అవగాహన అనుభవాలు నుంచి)

# ఎన్.పి.యం. పై కొన్ని సందేహాలు - సమాధానాలు

**ఎన్.పి.యం. అంటే ఏమిటి ?**

వ్యవసాయంలో పురుగుమందులను, జన్యు ఇంజనీరింగ్ ఉత్పాదకాలను పూర్తిగా మానేయడం. ప్రకృతిలో పర్యావరణ సమతౌల్యాన్ని పునరుద్ధరించడం. రైతుల స్వావలంబన ధ్యేయంగా పని చేయడం. స్థానికంగా దొరికే, తక్కువ - ఖర్చు వనరులను ఉపయోగించడం. రైతుల నికర ఆదాయాల్ని పెంచడం.

**ఎన్.పి.ఎం. కానిదేమిటి ?**

రసాయనిక పురుగు మందులకు బదులు జీవ సంబంధ పదార్థాల్ని ఉపయోగించడం మాత్రమే ఎన్.పి.ఎం. అనుకుంటే సరికాదు.

**దీనికి వ్యవసాయంలో 'హరిత విప్లవం' నమూనాకి తేడా ఏమిటి ?**

ఎన్.పి.ఎం. దేశ స్థాయిలో ఆహార సమృద్ధికన్న కుటుంబ స్థాయిలో ఆహార భద్రతకు ఎక్కువ సాధించడం మీద దృష్టి కేంద్రీకరిస్తుంది.

**ఆవు పేడ, మూత్రంవంటి ఉత్పాదకాల వెనుకనున్న శాస్త్రీయత ఏమిటి? వాటిలోని ఏ పదార్థాల కారణంగా అవి పనిచేస్తున్నాయి ?**

అవి చక్కగా పని చేస్తున్నాయనేది రైతుల అనుభవం. వాటిలోని పదార్థాలేమిటి, శాస్త్రీయత ఏమిటి అనేది కనిపెట్టి చెప్పవలసింది ప్రయోగశాల సదుపాయాలున్న విశ్వవిద్యాలయాలు తదితర సంస్థలే. రైతుల వద్ద, ఎన్.జి.ఓ.ల వద్ద అలాంటి సదుపాయాలు ఉండవు కదా.

**ఎన్.పి.ఎం. పాటించింది ఈ ఏడాది మాత్రమే. పురుగుల బెడదను నివారించింది నేలలో మిగిలిన (నిరుటి) పురుగు మందుల అవశేషాలు కావచ్చు కదా. ఎన్.పి.ఎం. పద్ధతుల వల్లే అది జరిగిందని ఎలా చెబుతారు ?**

మీరన్నట్లు పురుగులను నివారించే స్థాయిలో నేలలో పురుగుమందుల అవశేషాలు ఉండడం నిజమైతే పర్యావరణానికి, మనుషులకు, నేలకు అవి ఎంత నష్టకరమో ఆలోచించాలి.

**అమెరికా మాదిరిగా ఇండియాలో రైతులకు మద్దతు ఇవ్వడంలేదు. అక్కడ 2% జనాభా వ్యవసాయంలో ఉంటే ఇక్కడ 65% ఉన్నారు. అందుకే అక్కడ వ్యవసాయం ఉత్పాదక ఖర్చులో 200% సబ్సిడీలు ఇస్తుంటే, ఇక్కడ 3% మాత్రమే ఇవ్వగలుగుతున్నారు.**

నిజమే. అలాంటి మద్దతు వ్యవస్థలు మనకు సాధ్యం కాదు. అందుకే అలాంటి వ్యవసాయం నమూనాలు మనకు పనికిరావు. అలాంటి టెక్నాలజీలను మన రైతులు భరించలేరు. ఆ నమూనాల్ని అనుసరించమంటారే గాని అంతటి మద్దతు అందించలేరు. అది అందించాలని మన ప్రభుత్వాన్ని ఎవరూ అడగడం లేదు. ఆ నమూనాలే వద్దంటున్నాం. ఏ దేశమయినా తన పరిస్థితులకు తగిన నమూనాల్ని తానే అభివృద్ధి చేసుకోవాలి. ఇండియాలో ఇంకా విదేశీ నమూనాల వెంటపడడం ఎందుకని ఆలోచించాలి. మనం మన వనరులకు, మన అవసరాలకు తగిన వ్యవసాయం నమూనాను అభివృద్ధి చేసుకోవాలి.

**హరిత విప్లవం వల్లనే ఇండియా స్వయం సంమృద్ధి సాధించింది. ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుంది. మీరేమంటారు ?**

'హరిత విప్లవం' నమూనా 'జాతి' యొక్క 'ఆహార సమృద్ధి'ని సాధించింది. అదే సమయంలో 'రైతుల ఆహార భద్రత' లేకుండా చేసింది. అది 'పంటల వైవిధ్యాన్ని' బలి చేసి 'దిగుబడి లక్ష్యాలు' సాధించాలని చూసింది. ఆహార వైవిధ్యాన్ని బలిచేసింది. వ్యవసాయాన్ని కేవలం కొన్ని పంటలకు కుదించింది.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in